# 11. మీకూ నాకూ భేదం

**ఆవేళ –** సెలవు గాదు. పొద్దున్న పదింటికి ఆఫీసుకి వెళ్ళినవారు, యీయన మధ్యాన్నం రెండు కొట్టేలోపుగానే యింటికొచ్చేసేరు. అదేమిటండీ అంటే ఎవరో దేశనాయకుడు అస్తమిస్తే సగం రోజు సెలవిచ్చార్లే అన్నారు. సగంరోజు యివ్వడమేమిటి పూర్తి దేశభక్తుడు కాడా అని నేను జోకేస్తే తప్పు తప్పు అని నన్ను చీవాట్లు పెట్టేరు. పూర్తిరోజే ఇచ్చేరుట, సెలవు; కాని, కబురు వీళ్ళ ఆఫీసుకు అర్థమై వారి ఎం.డి. (యమధర్మరాజు) దున్నపోతులాంటి జీపుమీద ఎక్కి ఆ ఆర్డర్ తెచ్చేసరికి పావుతక్కువ రెండు అయిందిట.

ఎండలో వచ్చేరు కదా అని నిమ్మకాయ కోసి నీళ్లూ చక్కెరా పోసి యిచ్చేను. కాసేపు అదీ ఇదీ మాట్లాడుకున్నాం. కాని అలవాటులేని మధ్యాహ్నంవేళ అలా ఇలా గడపలేకపోయాం. మేటనీకి వెళ్ళిపోదామండీ అన్నాను - నా సంస్కారాన్ని కాసేపు తిట్టారు. సెలవు ఇచ్చింది నాయకుడి సంస్మరణార్థం విచారించమనిగాని సినిమా ఎంజాయ్ చెయ్యమని అనుకున్నావా అని మళ్ళీ దెబ్బలాడేరు. నేనేమో చిలిపిగా నవ్వుకుంటూ 'సినిమాలో ఎలాగా మౌనం పాటిస్తాం కదండీ'అన్నాను. ఆయన అటూ ఇటూ చూసి 'సినీమాలు మాత్రం మూసెయ్యలేదనుకున్నావా!' అని తప్పించుకున్నారు. దాంతో ఇద్దరికీ మౌనం తప్పలేదు. "ఉంటే సాయంత్రం వెళదాంలే" అన్నారాయన.

"రామశాస్త్రిగారిల్లిదేనాండీ-" అంటూ వో సన్నని గొంతు మా పొరుగువాటాలో అడిగింది. ఆడగొంతుకేమో అని అనుమానం కలిగించే మొగ్గొంతుక.

"ఎవరు చెప్మా! నాకోసమేఁరి" అని మా ఆయన కంగారుగా వెళ్ళి తలుపు తీసేరు. మనిషి అటువేపు తిరిగున్నా. వచ్చిన మనిషెవరో ఈయనకి గుర్తురాలేదని తెలిసిపోతోంది.

"ఎవరండీ? రండి! లోపలికి రండి" అని ఆహ్వానించి దారి తప్పుకున్నారు.

మా పొరుగువాటా ఆయన ఈలోగా "ఏమిటో!" అని నిట్టూర్చి తలుపు వేసేశాడు.

"లోపలికి రండి" అని మా ఆయన నా వేపు చూశారు.

నేను ముందుగదిలో వున్నంతసేపూ ఆ వొచ్చినాయన లోపలికి రాడని నాకూ అనిపించింది. యివతలి గదిలోకి వచ్చేశాను. కుతూహలం చావక ఇవతలి గది ద్వారానికి తెరేసుకుని అక్కడే నించున్నాను.

వొచ్చినాయన "హో! నన్ను పోల్చలేదుటండీ!" అన్నాడు చిన్న యాక్షన్ చేసి.

ఆయన్నలా వదిలేసి మా ఆయన లోపల కొచ్చేశారు. అనవసరంగా ఓ గ్లాసు మంచినీళ్ళు తాగేసేరు. ఆయన కోసం కాబోలు ఓ గ్లాసుడు నీళ్ల చేత్తో పుచ్చుకు బయల్దేరారు. తెరదాకా రానిచ్చి 'ఎవరండీ' అని గుసగుస లాడేను. 'ఏమో తేలీడంలేదు.'అన్నట్టుగా మొహం పెట్టి వెళ్ళిపోయారు.

వీధి గదిలోకి వెళ్ళీవెళ్ళగానే 'మాధవరావేగా' అని మా ఆయన అనడం వినిపించింది.

"అమ్మయ్య బతికించేరు. కులగోత్ర ప్రవరలు చెప్పుకోవలసొస్తుందేమోనని జ్ఞాపకం చేసుకుంటున్నాను.- థాంగ్గాడ్!" అన్నాడతను. నీళ్ళు తాగడం, గ్లాసు కింద పెట్టడం వినిపించాయి.

"మరీ దారుణంగా మారిపోయావు. కొలిమిలోపెట్టి సాగ్గొట్టినట్టు మరీ యింత పొడుగెదిగిపోయావేమిటి!"

"భిలాయ్ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్నాన్లెండి. అక్కడ మహా మహా వాళ్ళే సాగిపోతున్నారు. నన్నూ ఒకవేళ సాగ్గొట్టారేమో కూడాను."

ఆమాత్రం జోకుకే ఆయనా ఈయనా కూడా పకపకమని నవ్వేసుకున్నారు.

ఆ నవ్వుల్లోంచే గతంలోకి వెళ్ళిపోయేరు అప్పుడలాగ కదూ - అంటే - ఇప్పుడెలాగా అంటూ క్వెశ్చన్లూ ఆన్సర్లూ దంచేస్తున్నారు. ఇంటికెవరైనా వస్తే సమయం సందర్భం కూడా గమనించక (ముఖ్యంగా పాలు తోడేసేశాక కూడా) కాఫీ కోసం హడావిడి చేసేసే ఈయన గారు కూడా ఇటువేపైనా చూడకుండా బడ బడా వాగేస్తున్నారు. సరే, చిన్ననాటి స్నేహితుడు కదా కప్పుకాఫీకి అర్హుడు కాకపోతాడా అని నేనే పట్టుకెళ్ళి ఇచ్చాను. అప్పుడేనా ఈయనగారు, ఆ మాధవరావుని తిన్నగా పరిచయం చేయలేదు.

"చూసేరా! మీకంటే మీ ఆవిడే నయం! మీరేమో కబుర్లు పెట్టుక్కూచున్నారు. గాని కాఫీ కావాలా అని అడగనైనా లేదు" అని ఆ మాధవరావు మళ్ళీ పకపకా నవ్వాడు.

"లేచిరండి- ఎటైనా వెళదాం."

"వెడదాం ఉండూ. ఇంకా నాలుగ్గైనా కాందే?"

"నాలుగైతేగాని బైటికి వెళ్ళకూడదండీ? - మీకింకా చిన్నప్పటి మూఢనమ్మకాలు పోలేదే!" అని నవ్వుతూ కాఫీగ్లాసు ఖాళీ చేసి టేబుల్ మీద పెట్టేశాడతను.

"ఏమిటి, ఇది బాగుంది. నాకా, మూఢ నమ్మకాలంటున్నావు!"

"మీకు ఉండేవిలెండీ, కొన్ని రకాల మూఢనమ్మకాలు! లెక్కలు పొద్దుట తప్ప ఇంకెప్పుడూ చెయ్యకూడదని; కాలేజీకి వెళ్ళే దార్లో యింగ్లీషు పొయెట్రీ గుర్తు తెచ్చుకుంటూ వెళ్ళాలనీ- సాయంకాలం షికారు వెళ్ళాలంటే అయిదున్నర దాటాలనీ; అధమం వెళ్ళినా ఏడులోపలే ఇంటికి చేరుకోవాలనీ -ఇలాగ!"

"అబ్బ! అబ్బ! ఏం చెప్పేవోయ్ - నీకు "కీ" ఇస్తే చాలు తెగ వాగుతావు" అంటూ గ్లాసులు రెండూ పుచ్చుకుని లోపలికొచ్చారీయన.

ఉషారుగా యీలేస్తూ బట్టలేసుకుంటున్నారు. ఆయన జాపిన చేతులకి బనీను, షర్టు, కర్చీఫు అందిస్తూ ఆయన చుట్టూ పరిభ్రమిస్తూ వున్నాను. 'ఎవరండీ అతనూ?' అని రెండుసార్లు అడిగేను.

ఆయన తేలిగ్గా నవ్వి. "అతనా? మాధవరావనీ, ఒకానొక తప్పిపోయిన బావమరిదిలే-" అని నా బుగ్గమీద మీటారు. "వాళ్ళదీ విశాఖపట్నమే-"

"ఏమిటన్నారూ? తప్పిపోయిన బావమరిదా? - అంటే ఓహో - వాళ్ళక్కనో, చెల్లెల్నో మీకిస్తామనొచ్చారాయేమిటి?" అన్నాను. వాళ్ళదీ విశాఖపట్నమే అనగానే ఇందాకట్నుంచీ మనసులో మెదుల్తున్న సందేహం గట్టిపడింది-

"ఆ ఆ - అదంతా వో కథలే - తరవాచ్చెప్తాను - మేం అలా వెళ్ళొస్తాం, అతనూ భోజనానికుంటాడు సుమా!" అని హడావుడిగా వెళ్ళిపోయారు గదిలోంచి.

ఇద్దరూ కలిసి "విక్కీ" మీద ఊరంతా చుట్టబెట్టి వొచ్చినట్టున్నారు. ఆరుంపావయింది.

మధ్యాన్నం ఈయన తొందరగా వొచ్చేసినప్పుడు సాయంత్రం సినిమా కెడదాం అనుకున్నాంగా. అందుకని తొందరగా వంటచేసుకుని కూర్చున్నాను. అన్నం తప్ప మిగతావన్నీను -భోజనానికి అతనుంటాడన్నారు. ఉన్నవాడు సినిమాకి మాత్రం మాతో రాకపోతాడా, ఒచ్చినవాడు సినిమా అయిపోయాక వచ్చి అన్నం వండేదాకా ఉండేలేక పోతాడా అని, వంటిల్లు బంద్ చేసేసి చీరకూడా మార్చుకుని సినిమాకి తయారై కూర్చున్నాను.

వాళ్లు వస్తూనే తుఫాన్లా లోపలికొచ్చారు. మా ఆయన "విక్కీ" ని వరండాలోంచి గదిలోకి పెట్టేస్తూ, "ఇదుగో, మేం సినిమాకి వెడుతున్నాంగానీ, నువ్వూ వస్తావా?" అన్నారు.

"మధ్యాహ్నం వద్దామనే అనుకున్నాను మరి -" అన్నాను నేను, తడుముకోకుండా, ఆ ఆహ్వానంలో ఆత్మీయత లేకపోవడాన్ని సూచనప్రాయంగా తెలియజేస్తూ.

"అదంతా నాకు తెలీదు. నువ్విప్పుడాలోచించుకుంటూ కూచోడానికి టైమ్ లేదు. ఒస్తావా, రావా; తొందరగా తేల్చి చెప్పు!"

ఇంకేం, నా సంగతి కావాలనే మర్చిపోయారని తెలుస్తూనే వుంది. వాళ్ళూ వాళ్ళూ చిన్నప్పటి స్నేహితులు. మొగాళ్లు. ఒకర్నొకరు మర్చిపోయేటంత దీర్ఘకాలం తరవాత కలుసుకున్నారు. కబుర్లు చెప్పుకుంటూ హాస్యాలాడుకుంటూ చూస్తారు సినిమా. వాళ్ళ మధ్య నేనెందుకులే అనిపించింది.

"పోనీ యివాల్టికి మీరు వెళుదురూ. నాకింకా వంట పూర్తవలేదు" అన్నాను నేను. ఏదో నాలిక చివర్నుంచి నాలుగు మాటలు.

"దట్సాల్‌రైట్! మరి మాకుమొహాలు కడుక్కుందికి నీళ్లు వగైరాలు - సరే. నేను చూసుకుంటాన్లే!"

మరొకప్పుడైతే మొహం కడుక్కునేటందుకు నీళ్లు, సబ్బు, తువాలు అన్నీ సిద్ధం చేసిపెట్టి; అట్నుంచి ఎప్పుడొస్తారా- అని నిరీక్షిస్తూ దువ్వెనా అద్దం పట్టుకు నుంచోవాలి. లేకపోతే నా ప్రాణాలు పీకేశారన్న మాటే!... మరో రకం కాఠిన్యం కాదు; ఇదంతా నా డ్యూటీయేనని వారి తీర్మానం! సరే యిలాంటివన్నీ చెయ్యకపోతే నాకు మాత్రం యిరవై నాలుగు గంటలూ ఎలా గడుస్తాయి రోజూను!

ఇవాళ నా నోటంట ఆ సమాధానం రావడమే ఆలస్యం; నిమిషాల మీద అన్నీ ఏర్పాటు చేసుకుని వెంటనే బట్టలు కూడా మార్చేసుకుని, ఏదీ - ఆరుంపావుకి ఇంటికొచ్చిన వాళ్ళు ఆరూ ఇరవయ్యాయిదయ్యేసరికి లేరు.

పది అవుతుండగా సినిమానుంచొచ్చేరు. నీళ్ళ డ్రమ్ముకి ఇటూ అటూ చెరో చెంబూ పుచ్చుకుని సరిగంగ స్నానాలు చేసేరు యిద్దరూనూ. ఎలాగయితేనేం, పదింపావుకి విస్తళ్ళ దగ్గర అమిరేరు.

✣ ✣ ✣

"మొత్తానికి అసలు సంగతి చెప్పావే కాదు. మీ అన్నపూర్ణ ఎక్కడుంది?" అని మా ఆయన నవ్వుతూ సంభాషణ ప్రారంభించేరు; భోజనం సగం నిశ్శబ్దంగా అయ్యాక.

అతను తలొంచుకుని భోంచేస్తున్నాడు.

మా ఆయన నావేపు భావగర్భితంగా చూసేరు. తలవోసారి యెగరేసేరు. తెలుస్తూనేవుంది; అన్నపూర్ణ ఎవరో ఆవిడ గాథ మాధవరావుచేత చెప్పించాలి.

"రాజమండ్రిలోనే వుందా?" అని మళ్ళీ ఈయన అడిగేరు.

"లేదండీ - కాకినాడొచ్చేసేరు."

"కులాసా!?"

"ఆఁ. కులాసాకేంలోటు? దానికప్పుడే నలుగురు పిల్లలు."

"జీతం ఎంతేమిటి, వాళ్ళాయనకి?"

"ఎంతో ఏదండీ, మూడువందలిరవై అనుకుంటాను."

"మీ అన్నపూర్ణ కూడా యేదైనా ఉద్యోగం చేస్తే సరిపోను. వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు."

"ఏం చేస్తుంది, దాని మొహం!"

"అదేంటోయ్, అలా అంటావు! చక్కగా చదువుకుందిగా! పైగా టైపూ షార్ట్ హేండూకూడా వొచ్చునాయె-"

"అయితే మాత్రం? నలుగురు పిల్లల్తో ఇంటిపనే చేసుకోలేక చస్తున్నాది. చంటిదానికి ఏడాదెళ్ళి రెండోనెల!"

మా ఆయన వొక నిట్టూర్పు విడిచారు. 'ఎంతైనా నాకు తప్పదుకదా అనుకోడం!'

అన్నపూర్ణ ఎవరో నాకు తెలియదు. ఆయనగారు చూపిస్తు(న్నట్టు నటిస్తు)న్న సానుభూతికి ఆమె అర్హురాలే అయివుంటుంది. కాని ఈయన ధోరణంతా చాలా అసహ్యంగా వుంది. పరిహాసంగా వుంది అన్నపూర్ణ బ్రతుకు ఈయనగారికి. ఈయన్ని పెళ్ళిచేసుకొని ఉండవలసింది కాబోలు, ఆ అమ్మాయి. అలా తన్ని పెళ్ళాడనందుకు ఆ అమ్మాయి ఇప్పుడనుభవిస్తున్న బాధలు చాలా తక్కువ అయినట్లూ ఇంత కన్నా కఠిన నరకం అనుభవించినా అందులో ఆశ్చర్యపడవల్సిందేమీ లేదన్నట్టూ చెప్పక చెప్తోంది ఆయనగారి ధోరణి.

"మరి నువ్వింకా పెళ్ళిచేసుకోలేదేం?"

అతను ఇంతసేపటికి చిన్న రిలీఫ్‌తో నవ్వాడు. "యింకా సరైనపిల్ల కుదర్లేదండీ-

"వోహో -యెలాంటి పిల్ల కావాలి నీకు?"

ఇలా మరో ఐదు నిమిషాలు అతన్ని నోట్లో ముద్ద పెట్టుకోనివ్వకుండా కబుర్లు పెట్టారు. "పాపం ఆయన్ని భోంచెయ్యనివ్వరేమండీ" అని నేను కలగజేసుకున్నాను.

"సరేలే- నీకాకలి వేస్తోంది గాబోలు. మర్చిపోయాను " అని ఆ హుషార్లో నా మీదకూడా ఓ జోకు పేల్చారు మా ఆయన.

రాత్రి పదకొండున్నర కెళ్ళే బండికి ఆయన్ని స్టేషన్‌కి దిగబెట్టేసి, నోటినిండా కిళ్ళీ మొహంనిండా సంతోషం పెట్టుకుని ఇల్లు చేరారు.

"నువ్వింకా మేలుకొనే వున్నావే!".

"ఏదో ఇవాళ మీ ఫ్రెండు ధర్మమా అని-"

బట్టలు మార్చుకుని కాళ్ళు కడుక్కుని మంచంమీద కూచున్నారు. "పాపం మాధవరావు మంచివాడు. ఏదో పైకొస్తున్నాడు. భిలాయ్‌లో ఇంజనీరింగు సూపర్‌వైజరుట. నాలుగైదు వందలొస్తున్నట్టుంది" అని సంభాషణ ప్రారంభించేరు.

నేనేం అన్లేదు. ఆయన ధోరణి చూస్తే మాధవరావు పైకి రావడానికి, అన్నపూర్ణ (తనని

పెళ్ళాడక) కష్టాలనుభవించడానికీ, ఈవిధంగా ఆ కుటుంబంలో, సభ్యుల లిబరేషన్‌కి తానే కీలకం అయినట్టు మాట్లాడతారని తెలుస్తూనే వుంది-

"నీకెప్పుడేనా చెప్పానా, వీళ్ల అన్నపూర్ణ విషయం?" అని మళ్ళా ఆయనే ప్రారంభించేరు. నేను మరి అడగనని గ్రహించినట్టు-

"చెప్పడానికి మీకసలు జ్ఞాపకం వుంటేగా; మీరే మర్చిపోయారు-" అన్నాను.

ఆయన కళ్ళు సగం మూసేసి యింటి కప్పువైపు చూస్తూ "ఫ్లాష్ బాక్ స్టోరీ చెపుతున్న రైటరీమణిలా" అయిపోయారు- "అదంతా వొక కథలా వుంటుంది- నేను వైజాగ్‌లో ఆనర్స్ చదువుతున్నప్పుడన్న మాట.. నేనూ మా శ్రీనివాసరావూ వోరూమ్‌లో వుండేవాళ్ళం - అసలు శ్రీనివాసరావుకే యితను ఫ్రెండు! కొన్నాళ్ళు పోయాక నేను ఆ రూమ్‌లో దిగాను. ఇతను శ్రీనివాసరావు దగ్గిర లెక్కలు చెప్పించుకుంటూ వుండేవాడు. మేథమేటిక్స్‌లో నాదే పైచెయ్యని, శ్రీనివాసరావు ఇతన్ని నాకొప్పగించేడు. యితనప్పుడు బియ్యే మేథమెటిక్స్‌తో చదువుతూండేవాడు. వీళ్ళ యిల్లు మా రూమ్ కెదురుగుండానే ఉండేది.

"ఓ నాడు ఎలా వొచ్చిందో ప్రసక్తి; మామూలుగానే. మీరు ఎంతమంది అన్నదమ్ములు. అక్కచెల్లెళ్లెందరు అని నేను అడగడం అతను చెప్పడం తటస్థించింది. అన్నపూర్ణ వీళ్ళక్క, పద్దెనిమిది ఏళ్ళుంటాయి అప్పటికి. ఇతనికన్నా ఏడాదే పెద్ద. పధ్నాలుగో ఏటే స్కూలు ఫైనలు పాసైంది. టైపూ షార్ట్ హాండూ నేర్చుకుంది. నేనైతే అతను చెప్పిన వాళ్ళ కుటుంబ వ్యవహారాలు వినేసి వూరుకున్నానుగాని, మాధవరావుకి ఇందులో ఏదో విశేషం కనబడ్డట్టుంది- నేను గదిలో లేకుండా చూసి శ్రీనివాసరావుతో అన్నాట్ట; 'రామశాస్త్రిగారు మాకుటుంబ విషయాలన్నీ శ్రద్ధగా అడుగుతున్నా డండోయ్' అంటూనూ.

"మా శ్రీనివాసరావు సంగతి నీకూ తెలుసుగా... యితన్ని గడీకోసారి వారకి పిల్చి వడ్ల గింజలో బియ్యపుగింజ అనినాకు వినపడకూడ దన్నట్టుగా ఏదో చెబుతూ వుండడం అతని టెక్నిక్కు. యిదేదో జాగ్రత్తగా ఉండవలసిన విషయం అన్నట్టుగా గ్రౌండు ప్రిపేరు చేసేడు. అతనికి మీ అన్నపూర్ణని చేసుకోవాలని వుంది; నాతో ఓ సారి చూచాయగా అన్నాడు కూడాను అని పుట్టించేడు. ఆ మర్నాటినుంచీ ఇతను నా మీద లేనిపోని గౌరవం యేదో ప్రదర్శిస్తూ వొచ్చాడు. నా కనుమానం వేసింది. మా శ్రీనివాసరావునే అడిగేను. అతను కొంతసేపు నన్నో వెర్రాణ్ణి చూసినట్టు చూసి; చివరికి వాళ్ళ కుటుంబం యావన్మందికీ నేనంటే అమితమైన శ్రద్ధ అనీ, నేనొప్పుకుంటే అన్నపూర్ణని నాకిచ్చి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారనీ తేల్చాడు. మొత్తానికి - నాకూ లేకపోయినా వాళ్ళకీ లేకపోయినా ఈ ఉద్దేశం నాకుందని వాళ్ళ దగ్గరా వాళ్ళకుందని నా దగ్గరా చెప్పి, కథొకటి తయారుచేసేడు."

నాకు నవ్వొచ్చింది. "బావుంటుందండీ, ఆ అన్నపూర్ణెవరో?" అన్నాను.

"ఏమో, ఎవరు చూసేరు? అప్పటికి నేనాపిల్లని తిన్నగా చూళ్ళేదు. నన్నూ ఆ పిల్ల చూసుండదు. చిత్ర మేమిటంటే, వొకర్నొకరు చూసుకోకుండానే మా యిద్దరిమధ్యా వొకబలమైన ఆకర్షణ ప్రబలి వ్యాపించేదాకా, ఇదంతా శ్రీనివాసరావు అల్లిన కథ అని మాకెవరికీ తెలియనే లేదు!" అన్నారాయన- కథలో పారవశ్యం అంతా అనుభవించేస్తూనూ, బోలెడు యాక్షన్‌కూడా చేసేస్తూనూ.

"నిజంగానే పెళ్లాడెయ్యలేకపోయార్టండీ అంత యిదైతేనూ?"

"పెళ్లాడేయవల్సిందే. అప్పట్లో నాకు పెళ్ళిచేసుకోవాలని వుద్దేశం వుంటేనూ... ఆ తరవాతేమైందనుకున్నావు?-

"ఓనాడు లెక్కలు చెప్పించుకుందికి ఇతను బయల్దేరగానే యితన్తోబాబు వీళ్ళమ్మా వీళ్ళ అన్నపూర్ణా వీధరుగుదాకా వచ్చి తొంగిచూడ్డం ప్రారంభించేరు. మా కిటికీలోంచి మా రూమ్ అంతా రోడ్డుమీదికి కనబడిపోయేదిలే... అదిగో అప్పుడన్నమాట. మేం యిద్దరం వొకర్నొకరు సరిగ్గా చూసుకోడం."

"ప్చ్- అంత మజాగా లేదు. పెళ్ళి చూపుల ఘట్టం-" అని పెదవి విరిచాను ఆయనకి అదేం పట్టలేదు.

'ఇహ ఆ మర్నాట్నుంచీ నేనేం చేస్తున్నా ఒక్కసారి కిటికీ దగ్గిరకెళితే చాలు, ఎదురుగుండా గుమ్మంలో వీళ్ళ అన్నపూర్ణ నుంచునుండేది..నన్నాకర్షించాలని మా చెడ్డ తాపత్రయపడ్డాదనుకో-'

ఈ తరహా ధోరణి చూస్తే నాక్కొంచెం చిరాకేను. ఆడపిల్లల వెనకాతలపడి నానా గోలా చెయ్యడంతో ప్రారంభించి, కాళ్ళ బేరానికి రావడానికీ మొగాళ్ళకే చెల్లింది; అమ్మాయే నావెంటపడిందని గొప్పలు చెప్పుకోడానికీ మొగాళ్లకే చెల్లింది.

"మరైతే వాళ్ళు మీ వాళ్ళతో సంప్రదించాలని ప్రయత్నం చెయ్యలేదా, లేక మీకా పిల్ల లోపల్లోపల నచ్చలేదా? ఇంత వరకూ వచ్చేక సాధారణంగా ఆగిపోదే!... అసలు పిల్ల మీకు బాగా నచ్చితే ప్రయత్నాలు మీరే చేసుకునుండే వాళ్ళనుకుంటాను."

"నచ్చకేం?" అన్నారాయన; నేను పరిహాసంలో దిగుతున్నానని ఏమాత్రం గ్రహించలేని ధోరణి ప్రవాహంలో కొట్టుకుపోతూ. "బానేవుండే దన్నపూర్ణ; అంతంత కళ్లూ తనూను. చివరికి వ్యవహారం ఎలా ఫైసలైందని అడగవేం- వోనాడు మా శ్రీనివాసరావుని మెత్తగా చీవాట్లేస్తున్నా నన్నమాట; ఇదంతా యిలా అల్లకం చేసినందుకు. అప్పుడు హఠాత్తుగా ఈ మాధవరావు నాన్నగారు రూమ్‌లో కొచ్చేసేడు. అంతసేపూ పైనించి మా సంభాషణ విన్న వాడిలాగ, శ్రీనివాసరావుని చూసీ చూడగానే, "మీకిది తగునటయ్యా" అని ఎటాకిచ్చాడు. నాకు ఏదో కొంచెం నెర్వస్‌గా అనిపించి లేచి అవతలికి వెళ్లాను- అక్కడ ఎదురుగా వీళ్ళ కుటుంబం యావన్మందీ గ్రూప్ ఫొటోకి నిలబడ్డట్టు గుమ్మంలో నిలబడ్డారు.

"పాపం. తోక ముడిచారన్నమాట?" అన్నాను నవ్వులో తేలిపోతూ.

"తోక ముడవడం ఏమిటి- నవ్వా నువ్వాను." అన్నారాయన.

పక్కమనిషి ఏం చేస్తున్నాదో ఏం అంటున్నాదో తెలిసే స్థితికి వచ్చేరన్న మాట. అంటే కథ అయిపోయిందన్న మాట...

"ఏం లేదులెండి. మీరూ ఇంతమాత్రం గ్రంథసాంగులే కదా అని ఆనందిస్తు న్నాను. ఎటొచ్చి ట్రాజెడీ అయిందని విచారం కూడా ఉందనుకోండి."

మా ఆయన ధోరణిలో వేడి చల్లారింది. "నాకేంగాని పాపం అన్నపూర్ణదే ట్రాజెడీ. నలుగురు పిల్లల్ట; పాపం ! మొగుడికేమో గొర్రెతోక వుద్యోగం! "మేరేజెస్సార్ మేడిన్ హెవెన్ అంటారు- పాపంఅన్నపూర్ణ మేరేజీ ఎక్కడైందో ఎవరూ వూహించలేరు-" అన్నారు.

నేను కాసేపు వూరుకున్నాను.

"మీరేపేటలో వుండేవారు; వైజాగ్‌లో చదివినప్పుడు?" అన్నాను.

"జిల్లాకోర్టు కెదురుగా, డౌన్లో యిళ్లుంటాయి- అక్కడ - ఏం? ఎందుకు?"

"వీళ్ళది సొంతిల్లాండీ అక్కడ?"

"ఎవరిది, మాధవరావు వాళ్ళదా?- అబ్బే. ఏదో అద్దెకొంపేను. వీళ్ళనాన్నారు సిబీయం హైస్కూల్లో టీచరు. స్కూలు దూరమని రోజూ ఇదవుతూ వుండేవాడు. చుట్టూరా ఓ ఇరవై ట్యూషన్లున్నాయని ఇక్కడుండడం; లేకపోతే చంగల్రావు పేటకో సున్నపు వీధో వెళ్ళిపోతే అడిగిన వెంటనే ఇల్లిస్తారనేవాడు.

నా సందేహం నివృత్తయింది. ఒక్కటి తప్ప.

"వీళ్ళింటిపేరు వేలమూరి వాళ్ళాండీ?" అన్నాను; ప్రాణాలరచేత్తో పట్టుకుని-

"అరె! నీకెలా తెలుసు?... అదే."

నా గుండె నిమిషానికి నూటిరవై సార్లు కొట్టుకుంటోంది.

"ఈ మాధవరావు న్నేను బాగా ఎరుగుదునుస్మండీ." అన్నాను.

"నువ్వా? ఎలాగ? అన్నట్టు మీదీ విశాఖపట్నమే కదూ."

" వీళ్ళ నాన్నగారికి నుదుటిమీద పెద్ద కణితి వుంటుంది, ఆయనేనా?"

"అవును, ఆయనే!"

ఇంతసేపూ గ్రహించలేని విషయం ఇప్పుడాకళింపుకు వచ్చినందుకు పట్టరాని విస్మయంలో పడిపోయాను. అతను వెళ్ళిపోకముందు తెలుసుకోలేకపోయానే అని చెప్పరానిబాధ కలిగింది. అందుకనే కాబోలు; నామాటలు నా స్వాధీనంలోలేవు.

"మరి మావాళ్ళింట్లో వీళ్ళుండేవాళ్ళే- ఓహో? అప్పటికి మీరు చదువైపోయి వైజాగ్‌నించి వెళ్ళిపోయి వుండొచ్చు. వీళ్ళ నాన్నగారికి స్కూలుకు దగ్గిరకదా అని మాయింట్లో చేరేరన్నమాట... ఎక్కడో చిన్న వుద్యోగం చేస్తూ వుండేవాడు; ఎల్.ఎమ్.ఈ. అయి. వీళ్ళ అన్నపూర్ణకి పెళ్ళయిపోయి అత్తారింటికి వెళ్ళిపోయి వుంటుంది. నే నెప్పుడూ యెరగను-"

"వీళ్ళేనంటావా?-"

"ఆహా! వీళ్ళే అయ్యుండాలి... మా యింట్లో ఆవేపు చిన్నవాటాలో ఉండేవాళ్లు. అప్పటికే మావాళ్ళు నాకేవో సంబంధాలు చూస్తూ వుండేవాళ్లు మీ రెవరోకూడా మేం యరగం."

"మరైతే అతన్నిన్ను పోల్చలేదంటావా?"

"ఏమో అతనూ నేను పడ్డట్టే సందిగ్ధంలో పడ్డాడోయేమో. ఇంతకీ అతను తలెత్తినన్ను చూస్తేనా (మీరు చూడనిస్తేనా?) నేనైనా వాళ్ళ నాన్నగారికి నుదుటిమీద కణితున్నాదని మీరు చెప్పేదాకా పోల్చుకోనే లేకపోయాను. మీరే అన్నారుగా; కొలిమిలో పెట్టి సాగ్గొట్టినట్టు ఎదిగిపోయాడని! పైగా క్రాపింగు కూడా మార్చేడు!"

"అవును సీ్మ. మునుపు పక్కపాపిడి తీసేవాడు. ఇప్పుడు వెనక్కి దువ్వుతున్నాడు! ఇంతకీ-"

"అదేనండి! నాకు చాలా కష్టమనిపిస్తుంది... మామూలుగా అందర్లాగే వీళ్ళమ్మ మా నాన్నార్ని; మా అమ్మ వీళ్ళ నాన్నగార్ని 'అన్నయ్య గారూ' అని పిలుచుకొనేవారు. అందుకని ఎప్పుడేనా ఏదేనా అవసరం అయితే అమ్మని ఇతను అత్తయ్యగారూ అనేవాడు. అమ్మకూడా ఇతన్ని ఏదైనా పని మీద పంపుతూ వుండడానికనో యేమో - అల్లుడూ అంటూ గారం చేసేది. నాలుగేసి రోజులకోసారి నన్ను పలకరించేవాడు "ఏమిటి రాధా ఎప్పుడూ నిశ్శబ్దంగా వుంటావు." అని - ఏ పండగొచ్చినా శుభాకాంక్షలంటూ ఏదో వొకటి తెచ్చిచ్చేవాడు; గ్రీటింగు కార్డునుంచి ప్రెజంటేషన్ దాకాను. ఓ సారి నా పుట్టిన రోజొస్తే పదిహేడో పద్దెనిమిదో రూపాయలు పెట్టి వొక టేబిల్లాంపు తెచ్చిచ్చేడు. అదే యిప్పుడు మానాన్నగారి బల్లమీద్ది - సినిమాలకి - బీచికి రమ్మని ప్రాణాలు తినేసేవాడు."

"వెళ్ళలేకపోయావా పాపం!" అన్నారు మా ఆయన నవ్వుతూ. ఆ నవ్వు బరువుగా వుందనీ, ఆ మాటల్లో చిరాకుందనీ తెలియనంత ధోరణి ప్రవాహంలో నేనూ కొట్టుకుపోయాను.

"ఎందుకు వెళ్ళలేదు; వెళ్ళేదాన్ని!... నాకోసం అతను వర్క్‌షాపునుంచి తొందరగా వచ్చేసేవాడు. ఎనిమిదిగంటలు వుండాలని వాళ్ళు గట్టిగా వొత్తిడి చేస్తే పొద్దున్న ఎనిమిది నుంచి సాయంకాలం నాలుగు దాకా పన్చేసి వచ్చేవాడు. ఉన్నంతలో వాళ్ళ చెల్లెలు శారదని ముస్తాబుచేసి నేనూ రెడీగా వుండేదాన్ని- వారానికి రెండు రోజులయినా మేం ముగ్గురం జనానికి కనబడేవాళ్ళం"

✤ ✤ ✤

అదొక మహత్తరమైన అనుభవం. ప్రతీవాళ్ళకీ అలాంటిది ఒకటేనా వుంటుందని నా ఆశ. వలపెరుంగక బ్రతక్కండి; వలచి విఫలం అయినా అదే గొప్ప - అని కవి వాక్యం కదా! నాకు నమ్మకం వున్న వాక్యం.

లేకపోతే యీ వ్యర్థప్రపంచంలో బ్రతుకు నిస్సారం; నిరర్థకం!

చూసేదంతా పచ్చగావుంటూ, వెళ్ళే చోటల్లా మనసుకి గిలిగింతలు పెట్టే మలయమారుతం వీచడం - కొంత కాలమైనా లేకపోతే - మనుషులు యెన్నాళ్ళని బాధ్యతల్తో బరువుల్తో డ్యూటీల్లో అణగారి పోడం! ఓ రోజు ఓ కమ్మని పాటగా; ఓ రోజు ఓ తియ్యని కలగా ఓరోజు ఓ మరపురాని మనోహర దృశ్యంగా వుంటేనే బ్రతుకొక మధురమైన కావ్యం!

అతను నన్ను పెళ్ళిచేసుకో గోరుతున్నాడని -నా ప్రేమను సంపాదించడానికే ఇదంతా అని తెలుసుకోడాని కిష్టపడని , తెలిసినా తప్పనిపించని; తెలియజెప్పినవారే శత్రువులని - అనిపించే కమ్మని వయసు కాబోలది-

అన్నీ అయిపోయినాక, పెళ్ళితో వస్తుంది. మెలకువ, ఈ మధుర స్వప్న మంతా ఒట్టి కలేనా అనిపించడానికి!... ఎవరో అబ్బాయి. ఎమ్మే మేథమేటిక్సు- బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో పనిచేస్తున్నాట్ట. నెలకి నాలుగు వందలుచేస్తున్నాట్ట. ఎక్కువమంది బలగం లేరట. అని తెలియగానే "యిదేదో మనమ్మాయి కోసం భగవంతుడేర్పరచిన సంబంధం" అని తల్లిదండ్రులు మురిసిపోయి వున్నదేదో వూడ్చిపెట్టి జరిపించిన తతంగమే ఆ స్వప్నభంగం!

ఇంట్లోనే వుంటూ మంచి మనసుతో తృప్తిగా బ్రతుకుతూ వున్న మాధవరావుని... పొట్టిగా వున్నాడని 'వరహీనం' అన్నారు. - "నన్ను మీ వాళ్ళు హీనంగా చూస్తున్నారు- నువ్వూ అలాగే చూస్తావా?" అని అతనన్నప్పుడు కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

✤ ✤ ✤

"అలా చెప్పు. అయితే ఇందుకన్న మాట; అతనొచ్చింది!" అన్నారు మా ఆయన.

ఆయన దీర్ఘంగా నిట్టూర్చారని, ఆయన నవ్వు, మౌనం చాలా బరువైనవనీ ఆ క్షణాన నిర్బంగా స్ఫురించింది.

"ఏమిటి?" అన్నాను.

"ఎంత ద్రోహం! ఇలాటిపని తలపెట్టడానికి మీకు మనసెలా ఒప్పింది?" అన్నారాయన మళ్ళీ-

నాకింకా పూర్తిగా అర్థంగాలేదు.

మేం గుంటూర్లో ఉన్నాం. అతను "తెనాలొచ్చి మా పిన్నిగారింట్లో దిగానండీ. రేపు తెల్లారుజామున మెయిల్లో విశాఖపట్నం వెడుతున్నాను. మీరిక్కడున్నారని తెనాల్లో తెలిసి వో మాటు కలుద్దాం కదా అనివచ్చాను. నాకు మెయిల్ తప్పిపోకుండా చూస్తేనే మీతో సినిమాకి వస్తాను" అన్నాడు సాయంకాలం.

"తెనాలీ లేదు; పిన్నీలేదు! అంతా నాటకం..." అన్నారాయన మొహం వికారంగా పెట్టి.

"అదేమిటండీ అలా అయిపోతున్నారు? నాకేమిటో భయంగా వుంది!" అన్నాను.

"నోర్మూయ్! భయంట, భయం!" అని అసహ్యంగా అరిచారు ఆయన.

✣ ✣ ✣

నా మాట నమ్మరాయన. అంతకిముందే నేనూ, మాధవరావూ ఏదో ఏర్పాటు చేసుకున్నాం అంటారు. సెలవురోజు కావడాన్ని. అతను ఇంటికొచ్చి పట్టు పడ్డాడన్నారు. మేం ఉత్తరాలు రెగ్యులర్‌గా రాసుకుంటూ వుండాలని తీర్మానించేరు, ఎక్కడో రాసుకున్నట్టు ఆ మాధవరావు వున్నప్పుడు నే నాడిన మాటలూ చేసిన చేతలూ తిరగదీసి; "అందుకే నువ్వు సిగ్గులేక మాతో సినిమాకి వస్తానని తయారయ్యేవు"... "అందుకే మేం యిద్దరం స్నానానికి సిద్ధం అయితే అతనికి మంచి టవల్ ఇచ్చి నాకు చిరిగిపోయింది చ్చావు"..."అందుకే నేను అన్నందగ్గర మాట్లాడుతూవుంటే ఆయన్ని భోం చెయ్యనివ్వండంటూ అడ్డం వచ్చావు- " ఇలా సాగింది దండయాత్ర.

గడియకోసారి నా పెట్టి, చీరమడతలు తిరగేస్తారు; "సేవింగ్సు బ్యాంకు విత్‌డ్రాయల్ ఫారాలేమైనా ఉన్నాయేమిటి," అని ఏదో అంటూ. నాకతను రాసిన ఉత్తరాలు కనబడతాయేమోనని కాబోలు.

క్యాంపుకి వెళ్ళి సోంవారం వుదయానికి కానీ రానన్న పెద్ద మనిషి శనివారం రాత్రి హఠాత్తుగా వచ్చేసి తలుపు దబదబలాడించేస్తాడు.

పోస్టాఫీసు కెళ్ళి ఉత్తరాలు "విండో డెలివరీ" తీసేసుకుంటారు. "మావాళ్ళవి కూడా ఇచ్చెయ్యండి" అంటారుట; ఆ పోస్ట్‌మాన్ చెప్పాడు.

ఇదీ నాకు మాధవరావు చేసిన వుపకారం..... ☀

*("ఆంధ్రజ్యోతి' వీక్లీ : 19-1-1973)*

* విజయవాడ రేడియో స్టేషన్నుంచి 1960 లో "అరగంట నాటకంగా" ప్రసారమైంది.

*With the best compliments from :*

Grams : **MILLSFED**
Ph: **4755912**
**4752337**

# A.P. STATE FEDERATION OF CO-OPERATIVE SPINNING MILLS LTD.

**4th Floor, Posnett Bhavan, Ramkote, Hyderabad - 500 001.**

The **A.P.STATE. FEBERATION OF CO-OPERATIVE SPINNING MILLS** with its member co-operative spinning mills located in Various places in Andhra Pradesh Manufactures Quality Cotton Yarn in Both Cone and Hank Form in various count ranges. trade Enquiries for bulk purchases of Yarn may be made with the above address or directly with the member mills by the interested buyers.

**I. Venkateswarlu, I.A.S.**
***Managing Director.***